క్లుప్తంగా

మంత్రికి సీడీసీ చైర్మన్ కృతజ్ఞతలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మంత్రి దామోదర రాజనర్సింహను నూతన సీడీసీ చైర్మన్ రాంరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన నియామకం కోసం కృషి చేసిన రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు సిద్దన్న, ఆశిరెడ్డి, చిరు, విశ్వనాథం, శరత్, శ్రీను, నర్సింహులు, రఘు, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ రెడ్డి తదితరులున్నారు.

చెరకు రైతుల స్టడీ టూర్



మధ్యప్రదేశ్‌లో చెరకు పంటను పరిశీలిస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని పలు మండలాల చెరకు రైతులు స్టడీటూర్ కోసం మధ్యప్రదేశ్‌కు బయలుదేరి వెళ్లారు. రాయికోడ్ మండలం గోదావరిగంగా అగ్రో ప్రాడక్ట్స్ చక్కెర కర్మాగార యాజమాన్యం ఈ టూర్‌ను ఏర్పాటు చేసింది. ఫీల్డ్ ఆఫీసర్లు ఓంకార్, విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బెతుల్ జిల్లాలో గల హనుమంత్, శ్రీజీ షుగర్ ఫ్యాక్టరీలను సందర్శించారు. అక్కడ రైతులు సాగు చేస్తున్న చెరకు పంటలను పరిశీలించారు. అధిక దిగుబడులకు ఎలాంటి ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. తదితర విషయాలను తెలుసుకున్నారు. అనంతరం రైతులతో సమావేశమై చెరకు పంట సాగులో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు, చెరకు కటింగ్ మిషన్‌పై అవగాహన కల్పించారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి: విద్యాశాఖ ఆర్జేడీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగడానికి ప్రణాళికాబద్ధంగా చదవాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని ఆరూర్ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు , ఉపాధ్యాయుల హాజరు పట్టికను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యా ప్రమాణాలను ఏ విధంగా అమలు చేయాలో ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే



శ్రీకాంత్ కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను యువకులకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. బీఆర్ఎస్ పట్టణ యువత నూతన అధ్యక్షుడిగా కొత్తకొండ శ్రీకాంత్ ను నియమిస్తూ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడవాడలో యూత్ సమావేశాలు నిర్వహించి యువతను పార్టీలో చేర్పించి బలోపేతానికి శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని చాప్టా(బీ)లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం నిర్మాణానికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం సర్దార్ తండాలోని జ్వాలాముఖి కాళీబాబా ఆలయాన్ని దర్శించుకొన్నారు. కాశీవిశ్వనాథ ఆలయానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

‘పట్టు’ సాగుకు ప్రోత్సాహం

- సిల్క్ సమగ్ర పథకం కింద రాయితీలు
- జిల్లాలో 150 ఎకరాల్లో మల్బరీ తోటల పెంపకం
- మరో 40 ఎకరాల సాగు లక్ష్యం



జహీరాబాద్ మండలం మొగుడంపల్లిలో రైతు వేసిన మల్బరీ తోట

జహీరాబాద్ టౌన్: రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మల్బరీ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. హైదరాబాద్ మార్కెట్‌లో పట్టుగూళ్లకు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ రాయితీలు ఇవ్వడంతో పట్టుపురుగుల పెంపకం క్రమంగా పెరుగుతోంది. జిల్లాలో 150 ఎకరాల్లో మల్బరీ తోటలు ఉండగా.. మరో 40 ఎకరాల్లో విస్తరించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణ కోసం ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ప్రోత్సాహకాలు ప్రకటించింది. రెండు సంవత్సరాల క్రితం పట్టుగూళ్ల ధర కిలో రూ.400 ఉండగా.. గతేడాది రూ.600కు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో కూడా భారీ డిమాండ్ ఉండటం వల్ల తోటల పెంపకం పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వాలు సిల్క్ సమగ్ర పథకం ద్వారా రాయితీలు ఇస్తుంది.ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ జనరల్ రైతులకు వేర్వేరుగా రాయితీలు ప్రకటించి ప్రోత్సహిస్తోంది.

అధిక దిగుబడి

మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే నిరంతరం కాపు వస్తుంది. చీడపీడల బెడద అంతగా ఉండదు. ప్రారంభంలో షెడ్డు తదితరాలకు పెట్టుబడి అసరం ఉంటుంది. ఆ తరువాత పంటలకు గుడ్లను కొనటం, మందు ద్రావణం, కూలీలు తదితర చిన్నచిన్న పెట్టుబడులు మాత్రమే ఉంటాయి. ఏడాదిలో 6–8 పంటల వరకు కాపు తీసుకోవచ్చు. 100 గుడ్లకు 80 కిలోల వరకు పట్టుగూళ్లు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కూకూన్ ధర రూ.600 వరకు ఉంది. 25–35 రోజులకొక పంట పూర్తవుతుండగా ఖర్చులు పోను ఎకరాకు కనీసం రూ.80 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

రాయితీలు

సిల్క్ సమగ్ర పథకం ద్వారా మల్బరీ తోటలు, పట్టుపురుగుల పెంపకానికి పలు రాయితీలు ఇస్తుంది. జనరల్ రైతులకు రెండు ఎకరాల మల్బరీ సాగుకు రూ.60 వేలు ఇస్తుండగా ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.78 వేలు ఇస్తుంది. పట్టుపురుగులను పెంచడానికి షెడ్డు నిర్మాణం కోసం రూ.5 నుంచి రూ.6.5 లక్షలు ఖర్చు అవుతుంది.షెడ్డు నిర్మాణానికి సాధారణ రైతులకు రూ.2.25 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 2.95 లక్షలు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. షెడ్డులో అమర్చే స్టాండ్‌లు, ట్రేలు ఇతర సామగ్రికి రూ.37,500, రోగ నిరోధక మందులకు రూ.2,500 నుంచి రూ. 3.250 చొప్పున నిధులు ఇస్తున్నారు.



షెడ్డులో సిద్ధమవుతున్న పట్టుగూళ్లు

ఏడాది పొడువునా ఆదాయం



పట్టుపురుగుల పెంపకంతో సంవత్సరం పొడవునా ఆదాయం పొందవచ్చు. తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటే ఎకరా విస్తీర్ణంలోని పంటకు కనీసం రూ.1.30 క్వింటాళ్లకు పైగా పట్టుగూళ్లు వస్తాయి. ఫలితంగా రైతులకు మంచి ఆదాయం వస్తుంది. రైతులు ముందుకు వచ్చి మల్బరీ తోటల పెంపకానికి ముందుకు రావాలి.

– శ్రీనివాస్, సెరీకల్చర్ అధికారి, జహీరాబాద్

ప్రభుత్వం నుంచి రాయితీలు



పట్టు పరిశ్రమ ద్వారా వాణిజ్య పంటల కంటే అధిక ఆదాయం పొందవచ్చు. మల్బరీ సాగుకు జిల్లాల్లో అన్ని విధాలుగా అనుకూలం ఉంది. ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతుంది. పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతులకు మల్బరీ మొక్కల పెంపకం, షెడ్డు నిర్మాణం, నాటి సదుపాయం, పరికరాలు, రోగ నిరోధక మందులకుగాను పెద్ద మొత్తంలో రాయితీలు ఇస్తున్నాం. జిల్లాలో 150 ఎకరాల్లో మల్బరీ తోటలు ఉండగా ఈ ఏడాది మరో 40 ఎకరాల విస్తీర్ణం పెంచడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 20 ఎకరాల్లో తోటలు పెంచాడానికి రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఆసక్తి ఉన్నవారు స్థానిక అధికారులను సంప్రదించాలి.

– సోమేశ్వర్‌కుమార్, ఉద్యావనశాఖ సంయుక్త సంచాలకులు, సంగారెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1984–85 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య హైస్కూల్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అప్పట్లో వారికి విద్యను బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు. రాలేకపోయిన గురువుల ఇంటి వద్దకు వెళ్లి సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు గురువుల ఆశీస్సులు తీసుకున్నారు. 39 సంవత్సరాల తర్వాత అందరినీ ఒకే వేదికపై చేర్చేందుకు కృషి చేసిన శ్రీ చైతన్య హైస్కూల్ డైరెక్టర్ నరసింహ, కుటుంబ సభ్యులను పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య



మాట్లాడుతున్న మాణయ్య

జోగిపేట(అందోల్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య అన్నారు. శుక్రవారం జోగిపేటలో ఏర్పాటు చేసిన మండల, పట్టణ పీఆర్టీయూ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి వాటికి పరిష్కార మార్గాలు చూపిస్తున్న ఏకై క సంఘం పీఆర్టీయూ అని అన్నారు. అనంతరం సంఘం పట్టణాధ్యక్షుడిగా నరోత్తం కుమార్, గ్రామీణ అధ్యక్షుడిగా రాజమల్లు, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడిగా సంతోష్ కుమార్, పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ పీఆర్టీయూ సభ్యులు పాల్గొన్నారు.

నల్లవాగు ఆక్రమణలపై సర్వే

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో ఆక్రమణకు గురైన నల్లవాగు కాలువను శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరస్వతి మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని 626, 627, 628 సర్వే నంబర్లలో ఆక్రమణకు గురైన నల్లవాగు కాలువను సర్వే చేస్తున్నామన్నారు. అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో పల్లెనిద్ర



పల్లె నిద్రలో భాగంగా విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలో గురువారం రాత్రి మండల స్థాయి అధికారులు బీసీ వసతి గృహంలో పల్లెనిద్ర చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగమణి, ఎంపీడీఓ సత్తయ్య సిబ్బంది వసతి గృహం వంటశాలలో పరిశుభ్రత, వంట సరుకుల నాణ్యత పరిశీలించారు. అనంతరం డాక్టర్ నాగమణి విద్యార్థుల ఆరోగ్య సంబంధిత విషయాలు అడిగి తెలుసుకొన్నారు. విద్య బోధన ఎలా సాగుతుందని విద్యార్థులతో ఎంపీడీఓ మాట్లాడారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామప్ప సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సీమంతం వేడుకలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీల సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన్–పోషణ మాసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోషకాహార లోపంతో ఎదుగుదలలేని పిల్లల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పుష్ప, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ సురేశ్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో...

న్యాల్‌కల్(జహీరాబాద్): పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరిగా ఇవ్వాలని సీడీపీఓ అంజమ్మ దల్లిదండ్రులకు సూచించారు. మండల పరిధిలోని మిర్జాపూర్(బి) పీహెచ్‌సీలో శుక్రవారం పోషణ్ అభియాన్ నిర్వహించారు. కార్యక్రమానికి జహీరాబాద్ సీడీపీఓ అంజమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, వైద్యులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ అంజమ్మ

జూకల్ శివారులో పంటల పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారులో సాగైన వరి, పత్తి పంట పొలాలను శుక్రవారం ఏఆర్ఎస్ తోర్నాల్ శాస్త్రవేత్త శ్రీజయ, ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్ విశ్వకర్మ, ఉద్యానవన శాస్త్రవేత్తలు సరిత, శ్వేత, ఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్‌లు సందర్శించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల నేపథ్యంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలనిచ్చారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లిలో రైతు లింగం, రాజు వ్యవసాయ క్షేత్రంలో వరి పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. అగ్గితెలుగు నివారణకు సూచనలిచ్చారు. పత్తి పంటలో ఆకులు, కాయ, పిందు రాలిపోవడం గమనించి దీని నివారణకు మందు పిచికారీ గురించి వివరించారు. వారి వెంట ఏఓలు శంకర్, వెంకటేశం, ఆసియాబేగం, ఏఈఓలు రాందాస్, హరీష్, సతీష్, రఘునాథ్, సురేష్, సవిత ఉన్నారు.

తెగుళ్ల నివారణ చర్యలు పాటించాలి

- ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల సూచనలు



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కల్హేర్(నారాయణఖేడ్): వరి, పత్తి సాగులో తెగుళ్ల నివారణ చర్యలు పాటించాలని ఏఆర్ఎస్(తోర్నాల) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టీ విజయ రైతులకు సూచించారు. శుక్రవారం నిజాంపేట మండలం మునిగేపల్లి శివారులో వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిలో అగ్గి తెగులు నివారణ కోసం ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరిలో కాండం తొలిచె పురుగు, కంపు నల్లి నివారణ, పత్తిలో ఆకులు, కాయ, పిందె రాలిపోవడం నియంత్రణ చర్యలపై రైతులకు అవగాహన కలిపించారు. కార్యక్రమంలో ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ డీ శ్వేత, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, కె.సరిత, ఏడీఏ నూతన్‌కుమార్, ఏఓలు ఆసియ బేగం, శంకర్, వెంకటేశం, మహేశ్ చౌహాన్, ఏఈఓలు వంశీవర్ధన్‌గౌడ్, వంశీకృష్ణ, రాందాస్, సతీష్‌కుమార్, రఘునాథ్, సంగమేశ్వర్, వెంకటేశ్, ప్రశాంత్, శ్వేత పాల్గొన్నారు.



నారాయణఖేడ్: బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పటాన్‌చెరు: బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

బాపూజీ జీవితం ఆదర్శప్రాయం

తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. నారాయణఖేడ్, పటాన్‌చెరులలో ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, అలాగే.. సంగారెడ్డిలో ఫోరం ఫర్ బెటర్ నేతలు నివాళులర్పించారు. బాపూజీ తెలంగాణ, సహకార సంఘాల ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా కొనియాడారు.



సంగారెడ్డి: లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఫోరం ఫర్ బెటర్ నేతలు

సంక్షిప్త వార్తలు

◆ వీఆర్ఏ వారసుల వినతి

నారాయణఖేడ్: తమకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ 61 ఏళ్లు నిండిన వీఆర్ఏలకు సంబంధించిన వారసులు శుక్రవారం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20,555 మంది వీఆర్ఏలలో 16,758 మందిని అర్హతలను బట్టి వివిధ శాఖల్లో నియమించారు. కానీ 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు ఎలాంటి నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు. తమకు నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

◆ పొదల తొలగింపు

నారాయణఖేడ్: రైతుబజార్‌లో శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవరణ ఎదుట దట్టంగా పెరిగిన పొదలను కార్మికులు తొలగించారు. ఆవరణలో పరిశుభ్రత పనులను చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ స్వచ్ఛతపై స్థానికులకు అవగాహన కల్పించారు.

◆ జీవో 25ను సవరించాలి

కంది(సంగారెడ్డి): టీచర్ల సర్దుబాటు జీవో 25ను సవరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. శనివారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు అరుణశ్రీ, చందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. పాత ఎంఐజీ, విద్యుత్‌నగర్, తెల్లాపూర్, ఇంద్రానగర్, అంబేడ్కర్‌కాలనీ, కొమురంభీమ్‌కాలనీ, అన్నమయ్య ఎంక్లేవ్, మ్యాక్ సొసైటీ కాలనీ, మైఫేర్ రోడ్డు, హూడా ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

◆ రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలి

వట్‌పల్లి(అందోల్): నూతన గ్రామ పంచాయతీలలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని కోరుతూ దివ్యాంగుల సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అందోల్ డివిజన్ అధ్యక్షుడు సుభాష్‌నాయక్ మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీల నుంచి సొంత గ్రామాలకు కిలోమీటర్ల కొద్ది దూరం కాలినడకన వెళ్లి రేషన్ తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తున్నాయని పేర్కొన్నారు.

◆ వేతనాల పెంపుపై హర్షం

పటాన్‌చెరు టౌన్ : కేంద్ర ప్రభుత్వం అసంఘటితరంగా కార్మికుల కనీస వేతనాలను మరోసారి పెంచిందని భారతీయ– మద్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు లబ్ధి చేకూరుతుందని హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంపు అక్టోబర్ నెల నుంచి వర్తింపజేస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే కనీస వేతనాలను సవరించాలన్నారు.

◆ భవానీ సేవాలాల్ దీక్షలు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజకవర్గంలోని 54 గిరిజన తండాల్లో శుక్రవారం శ్రీభవానీ మాత శ్రీసేవాలాల్ మహరాజ్ దీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని సేడియాగుట్ట తండాల్లో శేఖర్ గురుస్వామి భవానీ దీక్షలను ప్రారంభించారు. మొదటిసారి నియోజకవర్గంలోని 54 తండాల్లో భవానీ మాత దీక్ష కార్యక్రమం జరుగగా పూజారి రవి, స్వాములు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024 – 25 విద్యా సంవత్సరానికి బీఏ, బీకామ్, బీఎస్సీ మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ యోగిబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తును ఆన్‌లైన్ సర్వీస్ పోర్టల్ ద్వారా చేసుకోవాలని పేర్కొన్నారు. ఫీజు గడువు 30వ తేదీతో ముగుస్తోందని, వివరాలకు 73829 29636 సంప్రదించాలని తెలిపారు.

◆ వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నాయికోటి బస్తీకి చెందిన రవీందర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 22న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఎంతకీ రాలేదు. భార్య లలిత స్థానికంగా, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ ఆసీఫ్ అలీ దర్యాప్తు చేస్తున్నారు.

◆ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

పటాన్‌చెరు టౌన్: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శనివారం చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ప్రచారజాతాను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకులు శాంత కుమార్, మహేశ్వర్ రెడ్డి, జైపాల్, శ్రీకాంత్, సుధాకర్, మురళీ, హాసిఫ్ పాల్గొన్నారు.

◆ విద్యాభివృద్ధికి కృషి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన పీపీ రాథోడ్‌ను ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి ఆమె సన్మానించారు.

◆ పరిసరాలు శుభ్రతగా ఉండాలి

రాయికోడ్(అందోల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ షరీఫ్ సూచించారు. మండలంలోని సింగతం గ్రామంలోని వివిధ వాడల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు.

వట్‌పల్లిలో...

వట్‌పల్లి(అందోల్): ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రను పాటించి ఆరోగ్యాలను కాపాడుకోవాలని అందోల్ మండల స్పెషల్ ఆఫీసర్ గీత అన్నారు. శుక్రవారం మండలంలోని సంగుపేట, అన్నసాగర్ గ్రామాల్లో గ్రామంలో స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.